కథ



“అమ్మో అలీసం అయిపోయిందమ్మా. అందరిళ్ళల్లో అంట్లు పెట్టుకుని కూర్చుని ఉంటారు. అసలే ఆదివారం. ఎన్ని తిట్లు తినాలో” పని మనిషి పద్మ కంగారుపడుతూ తనలోతాను అనుకుంటున్నట్టుగా పైకే అంటూ రేణుక చీరలకి గంజిపెట్టి డాబా మీద ఆరేసి వచ్చింది.

“మరేం..కొంపమునిగిపోదులేవే, ఇదిగో ఈ రెండు పూరీలు తిని వెళ్ళు” రేణుక వేడి వేడి పూరీలు, బంగాళాదుంపల కుర్మా పేపర్ ప్లేట్లో వేసి పద్మకి ఇస్తోంటే ఓ క్షణం అసూయగా అన్పించింది. అరగంటనుంచీ టిఫిన్ తిని స్నానానికి వెళ్దామని కూర్చున్న నన్ను పట్టించుకోకుండా ముందు దానికి పెడ్తోంది. ఇల్లాళ్ళకి మొగుళ్ళ మీద కంటే పనిమనుషులమీదే ప్రేమ ఎక్కువ. లోలోపల నవ్వుకున్నాను.

రేణుకతో పెళ్ళయి మూడు నెలలయింది. పెళ్ళయినప్పట్నించీ కాపురం వారానికి మూడు సినిమాలు, ఆరు షాపింగ్‌లుగా ముచ్చటగా సాగిపోతోంది. రేణుక ఇల్లూ, బట్టలూ అన్నీ నీట్‌గా ఓ పద్ధతిగా ఉంచుకుంటుంది. రుచిగా వంట చేస్తుంది. అందరితో కల్సిపోయే స్వభావం. ఓ పని ఎక్కువ చెప్పినా పనిమనిషి నవ్వుతూ చేస్తుంది. రేణుక దానికి తగ్గట్టుగా పద్మకెప్పుడూ హెయిర్‌క్లిప్స్, గాజులు, ఫ్యాన్సీ బొట్లు లాంటి వస్తువులు గిఫ్టులుగా ఇస్తుంది.

రేణుకలో అన్ని గుణాలు నాకు ప్రియమైనవే..బట్టలు కుప్పలుగా పేర్చకుండా ఎప్పటికప్పుడు ఉతికి, ఆరేసి ఇస్త్రీ చేసి బీరువాలో నీట్‌గా పెట్టుకుంటుంది. కాస్ట్లీ బట్టలు తనే ఉతుక్కుంటుంది సాధారణంగా. ఈరోజు పద్మ చేత చేయించింది తనకి వీలుపడదని.

“ఉండవే..ఇది తీసుకో” రేణుక పద్మ చేతిలో చిన్న అట్టలాంటిది పెట్టింది. ‘అది రోల్డ్ గోల్డ్ చైన్..దానికి నీలంరంగు రాయి పెండెంట్..ఎప్పుడో కొన్నట్టుంది’ మనసులో అనుకున్నాను.

☆ ☆ ☆

“ఈరోజు రాత్రి మీరిద్దరూ మా ఇంటికి డిన్నర్‌కి రావాలి” పక్కవాటాలో ఉంటున్న హరీష్, ఆయన భార్య స్వాతి లోపలికి వస్తూ అన్నారు.

“అబ్బే ఎందుకండీ”

“ఎందుకేమిటి..మీ పెళ్ళయి మీరిక్కడికి వచ్చినప్పటినుంచీ పిలవాలనుకుంటున్నాం. ఇప్పటికి కుదిరింది”

“సరే వస్తాం..కానీ మీరిద్దరూ అలా నిలబడే వున్నారేమిటి..కూర్చోండి. పూరీ కుర్మా చేశాను. రుచి చూడండి” రేణుక వంటింట్లోకి నడిచింది. “రేణూ ఇప్పుడేం వద్దు. కూరలవాడిని బయట ఆగమని చెప్పివచ్చాం. కూరలు కొనాలి. ఇంకోసారి వస్తాం” హరీష్, స్వాతి రాత్రికి రమ్మని ఇంకోసారి చెప్పి వెళ్ళిపోయారు.

☆ ☆ ☆


మర్నాడు పొద్దున్నే నవీన్ గట్టిగా ఏడుస్తోంటే “ఏమయింది?” అని అడిగాను హరీష్‌ని. “నా ఎర్రకారు..కారు కావాలి” నవీన్ ఏడుస్తూ పేచీ పెడ్తున్నాడు. వాడి కారు..చిన్న రేసింగ్ కారు నిన్న రాత్రి హాల్లోనే ఆడుకున్నాడు దాంతో. పొద్దున్నే అది కనపడలేదని పేచీ.

వంక దొరికింది కదా అని స్కూల్‌కి వెళ్ళనని మొరాయిస్తున్నాడు నవీన్. ఆరోజు పోయమ్ రెసిటేషన్ కాంపిటీషన్ ఉందిట స్కూల్లో. దానికోసం నవీన్‌ని చక్కగా ప్రిపేర్ చేసిన స్వాతి చిరాకుపడ్తోంది. నవీన్ మీద అరుస్తోంది. హరీష్ ఆఫీసు టైమవుతోందని చిరాకు పడ్తున్నాడు. సాయంత్రం ఇంకోటి కొని తెచ్చిస్తాం అన్నా వినకుండా నవీన్ గట్టిగా ఏడుస్తున్నాడు.

“మీరు ఊరుకోండి అన్నయ్యగారూ..స్వాతీ వాడిని ఏమీ అనకు. వినోదా స్టోర్స్ తెరిచే ఉంటారు ఈపాటికి. నేను వెళ్ళి వాడికి నచ్చింది కొనిపెడతాను” రేణుక గబగబా నా స్కూటర్‌లో నవీన్‌ని ఎక్కించుకుని బజారుకెళ్ళింది.

రేణుకలో నాకు నచ్చిన ఇంకో గుణం ఇది. గబగబా పూనుకుని కుడీ ఎడమా చూడకుండా అందరికీ హెల్ప్ చేస్తుంది. రేణుక బాగా కలిగిన వారింట్లోంచి వచ్చింది. చదువు బి.ఏ. సగంలోనే ఆపేసింది. అయితే చాలా సౌందర్యవతి. ఆ అందాన్ని చూసే పెళ్ళిచూపుల్లో నేను చిత్తుగా చిత్తయిపోయాను.

నాన్నగారు పేరున్న డాక్టర్. అమ్మ కొన్నాళ్ళు టీచర్‌గా పనిచేసి మానేసింది. అక్కకి పెళ్ళి చేసి పంపిం



ఎమ్.నాగలక్ష్మి

చాక..వయసు ఎక్కువ లేకపోయినా నీకూ చేసేస్తే బాధ్యత తీరుతుంది అంటూ నా పెళ్ళి జరిపించారు. అమ్మానాన్నలకి నేను ఒక్కడినే. స్వంతంగా పెద్ద బంగళా, కారు అన్నీ ఉన్నాయి. అయినా విడిగా ఉంచాలని మాకోసం నాన్నగారే ఈ ఇల్లు తీసుకున్నారు. వాళ్ళతోనే ఉంటామని నేనూ, రేణుకా అన్నా వినలేదు. వస్తూ పోతూ ఉంటాంగా అని మమ్మల్ని ఈ ఇంట్లో దింపారు. పెద్ద బంగళాని రెండు వాటాలుగా అద్దెకిచ్చి ఇంటివాళ్ళ కొడుకు దగ్గర వేరే ఊళ్ళో ఉంటున్నారు. పక్కింట్లో మంచి మిత్రులు..నాన్నగారు అన్నట్టే సంసార సుఖం తెలుస్తోంది. నాన్నగారితో కలిసి ఉంటే..ఈ సినిమాలు, షికార్లు..అర్థ రాత్రి దాకా తిరుగుళ్ళు కుదిరేవి కావేమో.

☆ ☆ ☆

రేణుక స్నానం చేస్తోంది. అలమార్లో పై షెల్ఫ్‌లో కొన్ని పాత జర్నల్స్ ఉన్నాయి. దాంట్లో ఓ పుస్తకం కోసం వెతుకుతున్నాను. హఠాత్తుగా పుస్తకాల వెనుక ఉన్న ఓ వస్తువుని చూసి షాక్ కొట్టింది. అది ఎర్ర రంగు బుల్లి రేసింగ్ కారు. నవీన్ ఆరోజు వాళ్ళ హాల్లో దీంతోటే ఆడు కున్నాడు. ఆ కారు మా ఇంట్లో.. అలమార్లో..ఓ మూల... అక్కడెవరు పెట్టారు దాన్ని? ఏం జరిగింది? గబుక్కున పద్మకి రేణుక ఇచ్చిన చైన్ గుర్తుకొచ్చింది. ఎక్కడో చూశాను దాన్ని. ఎక్కడ ఎగ్జిబిషన్‌లో. చటుక్కున గుర్తుకొ చ్చింది. రోల్డ్‌గోల్డ్‌షాపులో ఆరోజు రేణుక అన్ని వస్తువులూ చాలాసేపు చూసి బేరాలాడి ఆఖరికి కొనకుండా బయటికి వచ్చేసింది. ఏం కొనలేదు. తనకి బాగా జ్ఞాపకం. కానీ ఆ షాపులో గొలుసు తనింటికి వచ్చింది. అంటే పద్మకిచ్చే, క్లిప్పులూ, గాజులు..తను లేనప్పుడు కొంటోందనుకున్నాడు ఇన్నాళ్ళూ. కానీ ఛ..ఛ..రేణుక అలా చేయదు. బుర్ర గిర్రున తిరుగుతున్నట్టుగా అయింది. ఆమధ్య 'బాగా చదువుకో' అంటూ నవీన్‌కో పెన్ను ప్రెజెంట్ చేసింది. అదెక్కడి నుంచి వచ్చిందో తనకి తెలియదు. ముందురోజు షాపింగ్ నుంచి తెచ్చిన సంచులు ఓ మూల కన్పించాయి. నిన్న రాత్రి షాపింగ్ నుంచి వచ్చేటప్పటికే అమ్మా, నాన్నా వచ్చి ఇంటి ముందు కూర్చున్నారు. వాళ్ళతో మాటలు, భోజనాల హడావిడిలో రేణుక అలిసిపోయింది. సామాన్లు ఏవీ బయటికి తియ్యలేదు. గబగబా ఆ సంచుల్లో ఉన్న సామాన్లు..అందులోనే ఉన్న బిల్లుతో సరి చూసాను. మనసు కుంగిపోయింది అవమానంతో. బిల్లులో లేని చిన్న డైనోసార్ బొమ్మ, ఓ హెయిర్ క్లిప్ ఉన్నాయి సామాన్లలో. అంటే రేణుక 'క్లెప్టోమేనియాక్'..సుగుణాలరాశి, అందాలభరిణ అనుకున్న రేణుకకి 'క్లెప్టోమేనియా' అనే వ్యాధి ఉంది. ఎంత సిగ్గుచేటు. అలవాటు మానుకోమని చెప్తే రేణుక వింటుందా? ఏం చెయ్యాలి? నలుగురిలో పరువుపోకుండా రేణుకకి తెలిసి వచ్చేటట్టు చేయాలి. ..మనసంతా చేదుగా మారిపోయింది.

☆ ☆ ☆

"దొంగవెధవా..షాపుకి కొనడానికి వచ్చినట్టు వచ్చి..సామాను కొట్టేస్తావురా"

షాపు మేనేజర్ ఓ కుర్రాడిని పట్టుకుని దులిపేస్తున్నాడు.

"పొరపాటయింది సార్..అరచి గోల చెయ్యకండి సార్..నేను ఎమ్.సి.ఏ చదువుతున్నాను. మా నాన్న లాయర్. ప్లీజ్ పరువుపోతుంది. అరవకండి సార్" ఆ కుర్రాడు బతిమాలుడుతున్నాడు.

"పోలీసులకి పట్టిస్తాను. నువ్వు ఎవరైతే నాకేం" మేనేజర్ గయ్యిమన్నాడు. నేను అప్రయత్నంగా రేణుకవైపు చూశాను ఓరకంటితో. రేణుక మొహమంతా చెమటలు పడ్తున్నాయి. రేణుక మెల్లిగా స్టోర్స్ వెనక్కి వెళ్ళి కాస్సేపు అక్కడి అలమార్ల దగ్గర తచ్చాడింది. కాస్సేపయ్యాక నేనూ యధాలాపంగా అటువైపు వెళ్ళినట్టు వెళ్ళి అలమార్ల వైపు పరీక్షగా చూశాను. 'పెన్‌టార్చ్' ఒకటి అలమార్లో కంగారుగా పెట్టినట్టుగా ఉంది. ఎందుకంటే అది ఉండాల్సిన స్థానంలో లేదు.

"ఏమండీ..ఇంటికి పోదాం పదండి" రేణుక తొందర పెట్టింది.

ఇంటికొచ్చాక రేణుక చాలా మూడీగా ఉంది.

'ఏంటోయ్..ఇవ్వాళ నీ మూడ్ బాగున్నట్టు లేదే. అస్సలు మాట్లాడం లేదు షాపింగ్ నుంచి వచ్చినప్పటి నుంచీ"

"ఆ కుర్రాడిని నిజంగా పోలీసులకి పట్టించి ఉంటారా?" రేణుక అడిగింది.

"ఆ..పట్టించే ఉంటారు. దొంగతనం చేస్తే ఊరుకుంటారా? వాడికా శాస్తి కావాల్సిందే.. పెద్దింటి అబ్బాయినంటున్నాడు, పెద్ద చదువు చదువుతున్నాడు.. వాళ్ళ తల్లిదండ్రుల పరువుపో



తుంది. తోటి స్టూడెంట్స్‌లో చులకనైపోతాడు"

"అది జబ్బా..ఆ మేనేజరేదో అంటున్నాడు"

"అవును రేణుకా..ఇలా హాబీగా, కులాసాగా దొంగతనం చేయడాన్ని క్లెప్టోమేనియా అంటారు"

"ఏమండీ..నాకూ ఆరోగం ఉంది" రేణుక ఏడుస్తోంది.

నేను ఆశ్చర్యం నటిస్తూ రేణుక వైపు చూశాను.

"చిన్నప్పుడు మా ఊళ్ళో ఇంకొకళ్ళ తోటల్లోకి, దొడ్లలోకి వెళ్ళి పళ్ళు, కాయలు తెంపేదాన్ని మాకు ఎన్నో ఉన్నా. చీరలవాళ్ళు, గాజులవాళ్ళు, పూసల వాళ్ళు వస్తే వాళ్ళకి తెలియకుండా చిన్న చిన్నవి చిటుక్కున లాగేసే దాన్ని..ఏదో సరదాకి. నేను డబ్బులేక, కొనుక్కోలేక కాదు..ప్లీజ్..నన్ను డాక్టర్ దగ్గరకి తీసికెళ్ళరూ..నేను పోలీస్ స్టేషన్‌కి వెళ్ళను.." రేణుక వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"నీకు తెలిసింది కదా అలా చెయ్యకూడదని. అలా చేస్తే మనందరి పరువులూ వీధికెక్కుతాయి. అది గుర్తుంచుకో. అయినా ఇక్కడికొచ్చాక నువ్వేం అలాంటిపన్లు చెయ్యలేదుగా. ఇంక పడుకో" రేణుకని ఓదార్చి నేను నిద్రలోకి జారుకున్నట్టు నటించాను. రేణుక నేను నిద్రపోయానని నిర్ధారణ అయ్యాక మెల్లిగా లేచి ఓ ప్లాస్టిక్ సంచీ పెరటి వైపు తీసుకెళ్ళింది. డస్ట్ బిన్‌లో పడేసి ఉంటుందని అర్ధమయింది.

అర్ధరాత్రి రేణుక పడుకుంది అని నమ్మకం కలిగాక నేను మెల్లిగా డస్ట్‌బిన్ దగ్గరకి వెళ్ళాను. డస్ట్‌బిన్‌లో పడేసి ఉన్న ప్లాస్టిక్ సంచీ ముడి విప్పి చూసాను. అందులో నవీన్ ఎర్రకారు, రెండు స్పూన్స్, ఓ ఫోర్క్ (ఏ హోటల్ వో?) నాలుగు ప్లాస్టిక్ గాజులు, ఓ హెయిర్ క్లిప్ ఉన్నాయి. వాటిని దూరంగా విసిరేసి మళ్ళీ వచ్చి పడుకున్నాను.

నా ఫ్రెండ్ డిపార్ట్‌మెంట్ స్టోర్స్‌లో అందరు కస్టమర్స్ వెళ్ళిపోయాక కాస్త లేట్‌గా వెళ్ళి అతనితో, వాళ్ళ తమ్ముడితో నేను ఆడించిన నాటకం రక్తి కట్టింది. రేణుక మారుతుందని..తనని తాను మార్చుకుంటుందని నమ్మకం కలిగి నిశ్చింతగా నిద్రపోయాను. సమస్య కొండంత కాకుండా ముగిసిపోయినందుకు సంతోషంగా అన్పించింది.

☆

## నేత్రానందం

బిపాషా కొత్త చిత్రం గురించి అందరూ చర్చించుకుంటున్నారు. 'సుహాగ్', 'హోగీ ప్యార్ కీ జీత్', 'ఆషిక్' వంటి హిట్ చిత్రాలందించిన అనిల్ శర్మ నిర్మాతగా జాన్ అబ్రహాం, బిపాషాబసు, ప్రియాంశుచటర్జీ, రాజీవ్ వర్మల నటిస్తున్న కొత్త చిత్రం 'మమ్‌కినొ'షూటింగ్ ఈమధ్యే ప్రారంభమైంది. సంభాషణల రచయిత తన్వీర్‌ఖాన్ ఈ చిత్రంతో దర్శకుడిగా మారబోతున్నారు. బిపాషా గ్లామర్‌కి తగ్గట్టుగా రూపొందుతున్న ఈ చిత్రం పూర్తి వినోద ప్రధానంగా సాగుతుందంటున్నారు నిర్మాత, దర్శకులు.